## వివాహ బంధానికి అతీతమయిన ఆమె ప్రేమను అతను అర్థం చేసుకున్నాడా?

# ఇదే ముగింపు

### మహర్షి కథ

చిక్కటి చీకటి అవనిని ఆవరించి వున్న రాత్రి సమయాన... ఆకాశంమీద ఒంటరి నక్షత్రం ఒకటి తళుక్కున మెరుస్తుంది. విశాలమైన ఆకాశంమీద అలా ఒకే ఒక నక్షత్రం మెరుస్తూ కనిపించడం ఆకాశంవైపు చూసిన ఏ వ్యక్తినైనా ఇట్టే ఆకర్షిస్తుంది. అంతేకదా మరి! అందమైన రూపం ఉన్న అమ్మాయి చెక్కిలిమీద పుట్టుమచ్చ ఒకటి ప్రత్యేకంగా కనిపిస్తుంటే చూసిన వాళ్లెవరైనా బ్యూటిపుల్ అనక తప్పుతుందా?

అలాగే యాదృచ్ఛికంగా తల ఎత్తి ఆకాశంవైపు చూసిన వంశీకృష్ణను కూడా ఆ నక్షత్రం ఆకర్షించింది. అయితే చిత్రంగా అతని మొహంలో దాన్ని చూసిన ఆనందంకంటే విషాదమే తొంగిచూసింది. దానిక్కారణం మాత్రం సంధ్య అని అతనికి తెలుసు.

సంధ్య!


రెండక్షరాల ఆ పేరు తలచుకున్నప్పుడల్లా మెరుపుతీగలాంటి ఓ అమ్మాయి రూపం కళ్లముందు మెదిలి అతని మనసును చిత్రవధ చేస్తుంది. సంధ్య ఇప్పుడెక్కడుందో ఏం చేస్తుందో? అతన్నొక్కసారిగా తల విదిలించి - ఆ సమయంలో ఆమె జ్ఞాపకాలు తలచుకుని బాధపడడం ఇష్టం లేనట్లుగా చకచకా మెట్లెక్కి రైల్వేస్టేషన్‌లోకి ప్రవేశించాడు.

బయట ప్రపంచం మొత్తం చీకటిలో మునిగి వున్న ఆ రైల్వేస్టేషన్ మాత్రం పట్టపగలును జ్ఞప్తికి తెస్తుంది.

వంశీకృష్ణ నేరుగా ఎంక్వైరీకౌంటర్ దగ్గరకెళ్లి ''కృష్ణా ఎక్స్‌ప్రెస్ కరెక్ట్ టైంకొస్తుందా?'' అని ప్రశ్నించాడు.

''గంట లేట్'' చెప్పాడా కౌంటర్‌లోని వ్యక్తి!

ఇక చేయగలిగిందేమీ లేక, ఇలాంటిదేదో జరుగుతుందని ముందే ఊహించిన వాడిలా టిక్కెట్



కౌంటర్ దగ్గరకెళ్లి తను వెళ్లాల్సిన వూరికి టిక్కెట్ తీసుకుని ప్లా[illegible] ఖాళీగా వున్న బెంచీమీద కూర్చు[illegible]డు. [illegible]సమయంలో వంశీకృష్ణ ఊహించలే[illegible] గంట లేటవ్వడంవలన తను తన జీవితంలోని అతి వ[illegible]లుసుకునే అవకాశం కలుగు[illegible]ందని.

[illegible]గాపులు కా[illegible]

తప్పదు. అతనలా ఆలోచిస్తూనే చుట్టూ పరికించి చూడడం మొదలుపెట్టాడు. దూరంగా పైన బిగించి వున్న టీవీల్లోనుంచి తెలుగు పాటలొస్తున్నాయి. వాటిని చూడడంకోసం మనుషులు ఎగబడుతున్నారు. రకరకాల మనుషులు వాళ్లవంటిమీద రంగురంగుల డ్రెస్సులు. వారి రూపాలు, వారి డ్రెస్సులే కాదు. వాళ్ల మనస్తత్వాలుకూడా రకరకాలుగా వుంటాయి. ఒకడికున్న మనస్తత్వం ఇంకొకడికుండదు. ఒకడికున్న జ్ఞానం మరొకడికుండదు.

అతనలా ఆలోచిస్తూనే దూరంనుంచి ఎవరో స్త్రీ తనవైపే పరీక్షగా చూస్తుండడం గమనించి అలర్ట్ అయ్యాడు. ఎవరో మధ్యవయసును మించి వయసున్న స్త్రీ. తనవైపే ఎందుకలా పరీక్షగా చూస్తోంది. ఆమెకు తనకు మధ్య ఉన్న సంబంధం ఏమిటి? తను ఆమెకేమవుతాడు?

ఎన్నో అనుమానాలు ఒక్కసారిగా మనసును కుదిపెయ్యగా కళ్లు చిట్లించి ఆమెవైపు చూశాడు వంశీకృష్ణ. మరీ మరీ చూశాడు. కళ్లనే బైనాక్యులర్స్‌గా మార్చి చూశాడు. అతనలా తనవైపు పట్టిపట్టి చూడడం గమనించి ఆ స్త్రీ చిన్నగా నవ్వింది. అంతే.

మల్లెలు విరగబూచినట్లున్న ఆ నవ్వును చూస్తూనే ఒక్క క్షణం అతని గుండె ఆగి కొట్టుకుంది. అదే నవ్వు... ప్రపంచంలో మరే స్త్రీ నవ్వనటువంటి అద్భుతమైన చిరునవ్వు. కేవలం ఆ భగవంతుడు ఆమెకు మాత్రమే ఆపాదించిన చిరునవ్వు. అతనెంతగా ఆ నవ్వును చూసి కదిలిపోయాడంటే... తన సర్వస్వం ఆమె అయినట్టు ఒక్క ఉదుటున బెంచీమీదనుంచి లేచి నిలబడ్డాడు. ఏదో తెలియని అలజడి. మరేదో తెలియని ఉద్విగ్నత.

అతను లేచి నిలబడడం చూసి ఆమె అతనివైపు కదిలింది. ఆమె తనవైపు రావడం చూసి అతను రెండు అడుగులు ముందుకు వేశాడు. సరిగ్గా అప్పుడే మైకులోనుంచి ఏదో ట్రైను వస్తున్న ఎనౌన్స్‌మెంట్ ఇంగ్లీషులో మొదలైంది.

ఆమె అతనివైపుకొచ్చేస్తోంది. అతను మరో అడుగు ముందుకువేశాడు అంతే.

ఒక్కసారిగా 'సంధ్యా' అంటూ పెద్దగా పిలిచాడు వంశీకృష్ణ. అతని కంఠం ఎంత పెద్దదిగా వినిపించిందంటే... రైల్వే ప్లాట్‌ఫామ్ మీదున్న చాలామంది జనం అతనివైపు చిత్రంగా చూడడం మొదలుపెట్టారు. వంశీకృష్ణ మాత్రం ఎవర్ని పట్టించుకునే స్థితిలో లేడు. ఆ ముఖంలో దివిటీల వెలుగు. ఆ కళ్లల్లో నక్షత్రాల మెరుపు.

''సంధ్యా వచ్చేవా... సంధ్యా'' అతని కంఠంలోని వణుకును, ఆప్యాయతను స్పష్టంగా గమనించిందామె! ఆమె మరో అడుగుతీసి అడుగు వేయబోయేసరికల్లా అతను ఆమెను చేరుకుని ఆమె రెండు చేతుల్ని తన చేతులమధ్యకు తీసుకున్నాడు.

''బాగున్నావా వంశీ?''

అంతకంటే ఎక్కువ ఇంకేం మాట్లాడాలో ఆమెకు అర్థంకాలేదు. ఒకప్పుడైతే అతను రెండు మూడు రోజులు ఆలస్యంగా కనిపిస్తే చాలు అతడ్ని నిలువెల్లా చుట్టుకుని తన ప్రేమను తెలియపరిచేది. ఇప్పుడా అవకాశం లేదు. అవకాశం లేనిది అది రైల్వేస్టేషనని, అక్కడ జనం వున్నారని కాదు. ఇప్పుడామె మరొకరి భార్య.

''నువ్వు బాగున్నావా సంధ్యా'' ఆ కంఠంలో తనమీది ప్రేమను చూసి ఆమె చలించిపోయింది.

''ఎన్ని సంవత్సరాలవుతుంది మనం విడిపోయి. ఆరోజులింకా నీకుగుర్తేనా సంధ్యా'' అతని ధోరణిలో అతను చెప్పుకుపోతున్నాడు.

''నిన్నసలు మర్చిపోతే కదా గుర్తుచేసుకోవడానికి... అయినా అంత తేలిగ్గా మరచిపోయే ప్రేమనా తమది. నువ్వే కావాలని నన్ను

దూరంచేసుకున్నావుకాని, నువ్వే ... నువ్వే. ... కావాలని దూరం చేశావు నన్ను'

ఆమె మనసు మూగగా రోదించింది.

ఒకప్పుడైతే ఆ ఇద్దరు 'నీలో నేను - నాలో నువ్వు' అన్నట్టుగా వుండేవాళ్లు. అలాంటి ఆ ఇద్దరి గురించి తెలుసుకోవాలంటే మనం ఇరవై ఏళ్లు వెనక్కి వెళ్లక తప్పదు.

ఇరవై సంవత్సరాల క్రితం ఒకరోజు మధ్యాహ్నం...

''మనం కలుసుకుని ఇరవై రోజులవుతుంది తెలుసా'' అన్నాడతను ఆమె వడిలో తలపెట్టుకుని.

''అయితే...'' నిర్లక్ష్యంగా అందామె.

''అహా! ఏమీ లేదు. నేను కనిపించి ఇరవై రోజులవుతుందికదా. నువ్వు బాగున్నావా అని''

''ఏం బాగాలేను'' అతని నుదుటిమీద ఆటలాడుతున్న క్రాఫును సరిచేస్తూ అందామె.

''నేను కనిపించకపోయేసరికి దిగులు పట్టుకుందా?''

''అదేం కాదు'' ఆమె బుంగమూతి పెట్టి **అంది.**

''మరెందుకు బాగా లేవు. అయినా నీకోసం కొండమీది కోతినైనా తీసుకొచ్చి ఇచ్చేవాడిని నేనొకడ్ని వున్నానని మరచిపోయావా ఏమిటి?''

ఆ మాట విని దిగులుగా మొహం పెట్టి ''కొండమీది కోతిని తీసుకొచ్చి ఇచ్చేవాడివి నువ్వున్నావుకాని, సముద్రంలోని తిమింగలాన్ని తీసుకొచ్చి ఇచ్చేవాళ్లే కనిపించడంలేదు'' చెప్పి ఆ తర్వాత ఫక్కున నవ్వింది.

అతను మాత్రం ఉక్రోషంతో లేచి 'నిన్ను' అంటూ ఆమెను తన బాహువుల్లో బంధించాడు. అతను కోపంతో చూపించే బలప్రదర్శనకూడా ఆమెకు హాయిగానే వుంది. ఆమె ఆ తన్మయత్వంలో మునిగి వుండగా బయటనుంచి 'పోస్ట్' అంటూ పోస్ట్‌మెన్ పిలుపు వినిపించింది.

ఒక్కసారిగా ఆలోచనలనుంచి తేరుకుని, తన ఆలోచనలకు తనే సిగ్గుపడి అందంగా నవ్వుకుంది సంధ్య.

అందం అనేది ఆమెనుంచి పుట్టిందో... లేక ఆమెను చూసే అందం అనే పదం పుట్టిందో అర్థంకాదు. స్నఫ్ కలర్ చుడీదార్‌లో ఆమె సౌందర్యానికే 'మేకప్' నేర్పేటంత అందంగా వుంది.

''పోస్ట్''

మీరే కద్సార్ వొళ్ళువంచి పని చెయ్యమంది.



మరోసారి పోస్ట్‌మెన్ పిలుపుతో ఒక్క ఉదుటున మంచం మీదనుంచి క్రిందకు దూకి తూనీగలా బయటకు పరుగుదీసింది. మొహంలోని ఆనందాన్ని, చేతి వణుకును ఎంత దాచాలని ప్రయత్నిస్తున్నా సాధ్యం కావడంలేదు.

అసలు పోస్ట్‌మెన్ పిలుపు వింటూనే తనెందుకలా చిత్రమైన అనుభూతికి లోనవుతుందో ఆమెకు ఓ పట్టాన అర్థంకాదు. బహుశా దానిక్కారణం వంశీకృష్ణ అయి వుండవచ్చు. అయి వుండడమేమిటి?

వంశీకృష్ణే!

తన కంటి వెలుగు. తన నోటి పిలుపు- తన హృదయం. అప్పటికే పోస్ట్‌మెన్ ఆమె చేతిలో ఓ కవర్ వుంచి నవ్వుకుంటూ వెళ్లిపోయాడు. ఆమె చేతిలోని కవర్‌వైపు చూసింది. ఫ్రం అడ్రస్ దగ్గర వంశీ అని వుంది.

ఆమె చప్పున ఆపేరుమీద ముద్దుపెట్టుకుని తన చర్యను ఎవరైనా గమనించారేమో అని బెరుగ్గా అటు ఇటు చూసి ఎవరూ చూడలేదని గమనించి లేడిపిల్లలా లోపలకు పరుగెత్తింది.

లోపలికెళ్లీ వెళ్లగానే టేప్ రికార్డర్ స్విచ్ ఆన్ చేసింది. టేప్ రికార్డర్‌నుంచి 'మేరే సప్‌నోంకీ రాణి తు కబ్ ఆయేగీ' హిందీపాట మొదలయింది.

పాట వింటూ చేతిలోని కవర్‌ను గాలిలో అటు ఇటు త్రిప్పి మంచంమీదకు విసిరేసింది. ఆ తర్వాత ఎగిరి మంచంమీదకు దూకి ఉత్తరం ప్రక్కనే తలపెట్టుకుని పడుకుంది. తన ప్రాణమంతా ఆ కవర్‌లోనే వున్నట్టు ఆ కవర్‌వైపే ఆరాధనగా చూస్తూ కొన్ని క్షణాలు మౌనంగా గడిపింది.

ఊహూ. లాభంలేదు. ఇంకొక్క క్షణంకూడా ఆ ఉత్తరం చదవకుండా వుండడం తనవల్లకాదు. ఆమె ఇక ఆలస్యాన్ని భరించలేనట్టుగా కవర్ చించి ఉత్తరం బయటకు తీసింది. ఆమె ప్రమేయం లేకుండానే ఆమె కళ్లు అక్షరాలవెంట పరుగులు తీశాయి.

''డియర్ సంధ్యా,

ఈ విషయం నీతో ఎలా చెప్పాలా అని వారం రోజులుగా నాలో నేను కుమిలిపోయి చివరకు తెగించి ఈ ఉత్తరం వ్రాస్తున్నాను.

ఈ ఉత్తరం చదివిన తర్వాత ఇక జీవితంలో ఎప్పటికీ నువ్వు నన్ను క్షమించవని నాకు తెలుసు. కాని నేనేం చేయను చెప్పు. ఇప్పుడు నా జీవితం నా చేతుల్లో లేదు. ఇప్పుడు నేను మరొకరి భర్తను. నమ్మడంలేదుకదూ. నువ్వేమిటి... నా పెళ్లయిందన్న నాకే నమ్మకం కలగడంలేదు. కాని నా పెళ్లయిన సంగతి మాత్రం అక్షరాలా నిజం.

మొన్న నీ గురించి మన ప్రేమగురించి మా ఇంట్లో చెప్పాను. అంతే! ఏదో అణుబాంబు పేలినట్టు ఇంట్లో పెద్ద గొడవ చెలరేగింది. నా పెళ్లి నా చిన్నప్పుడు జరిగిపోయిందట. భార్య వుండగా మరో పెళ్లి ఎలా చేసుకుంటావని ఎదురు ప్రశ్నించారు.

వాళ్లు చెప్పిందేవిటో ముందుగా నాకర్థంకాలేదు. అర్థమయ్యేసరికి భయంతో వణికిపోయాను. ఇలాకూడా పెళ్లిళ్లు చేస్తారని మనకు తెలియదుకదా.

''నన్నడక్కుండా నా పెళ్లి చేసే హక్కు మీకెవరిచ్చారు?'' అంటూ పెద్దగా అరిచాను. వాళ్లు ఏవేవో కారణాలు చెప్పడం మొదలుపెట్టారు. జరిగిపోయిన తప్పును వీళ్లు చెప్పే కారణాలు సరిదిద్దలేవని అర్థమైంది.

ఏది ఏమైనా నిన్ను పెళ్లిచేసుకోక తప్పదని, నువ్వు లేనిది బ్రతకలేనని చెప్పాను.

అందుకు ఇంట్లోవాళ్లు ఏమన్నారో తెలుసా?

పెళ్లి చేసుకునేముందు నీమీదే ఆశలు పెట్టుకుని బ్రతుకుతున్న నీ భార్యను, నీ తల్లితండ్రుల్ని చంపి దహనసంస్కారాలు చేసి వెళ్లి మరీ పెళ్లి చేసుకో'' అన్నారు.

ఈ పరిస్థితుల్లో నేనేం చేయాలో నాకే

అర్థంకావడంలేదు. ఒకప్రక్క ప్రాణాధికంగా ప్రేమించిన నువ్వు - మరో ప్రక్కనున్న తల్లిదండ్రులు.

ఏం మనుషులు సంధ్యా వీళ్లు?

చచ్చేవాళ్లు చావక ఈ పెళ్లిళ్లు చూసి ఛస్తామని కోరడమేమిటి? ఈ బ్రతికున్నాళ్లు చకచక అదేదో బొమ్మల పెళ్లి అయినట్టు నా ప్రమేయం లేకుండానే, అసలు ఊహ తెలియని వయసులో నా పెళ్లి చేసేయడమేమిటి? ఇవన్నీ చూస్తుంటే ఈ మనుషుల మీదే కాదు. ఈ ప్రపంచంమీదే అసహ్యం కలుగుతోందనుకో!

ఎప్పుడో ఐదు సంవత్సరాల క్రితం చదువుకోవడానికి సిటీవచ్చి మీ ఇంట్లో అద్దెకు దిగినప్పుడు పరిచయమయ్యావు నువ్వు. ఈ ఐదు సంవత్సరాలలో నా ఊపిరిలో ఊపిరిగా కలిసిపోయిన నువ్వు ఇకనుంచి నాకేమీ కావు అన్న ఆలోచన నా మనసును తూట్లు పొడుస్తోంది. ఇంత దుఃఖాన్ని నేనెలా భరించగలను చెప్పు.

ఎక్కడో పుట్టి, ఎక్కడెక్కడో ప్రవహించి చివరకు సముద్రంలో కలసిపోయే నదికి, ఎక్కడో పుట్టి ఎక్కడెక్కడో పెరిగి చివరకు మట్టిలో కలిసిపోయే ఈ మనుషులకు చాలా దగ్గర పోలిక వుందికదూ! అందుకు మనిద్దరి జీవితాలే నిదర్శనం.

నువ్వెక్కడ పుట్టావో... నేనెక్కడ పుట్టానో... ఎంత విచిత్రంగా మనిద్దరం కలుసుకున్నామో... ఎంత విచిత్రంగా విడిపోవలసి వచ్చిందో... ఆలోచిస్తుంటే హృదయం విషాదంతో నిండిపోయింది.

ఇది చిత్ర విచిత్రమైన లోకం. ఈ లోకంలో కోరలతో కాటెయ్యని విషసర్పాలున్నాయి. పంజా విసరని పెద్ద పులులున్నాయి. వాటికి మనిద్దరి జీవితాలు బలి అయ్యాయి. అంతే

నన్ను మనస్ఫూర్తిగా క్షమిస్తావుకదూ!

నీ కాని

వంశీ


ఉత్తరం చదవడం పూర్తయింది. దానితోపాటు సంధ్య హృదయంకూడా ఆగినట్టనిపించింది. ప్రాణం ఒక్కటే మిగిలి వుంది. అదికూడా పోతే ఎంత బాగుండును. ఆమె అలాగే మంచంమీద కూలబడింది. అలా శూన్యంలోకి చూస్తూ ఆలోచిస్తూ వుండిపోయింది.

## చదువు

''మీ కుక్క తప్పిపోయిందిగా పేపరు ప్రకటన ఇవ్వకపోయావా?''

''అబ్బే... ఎందుకు మా కుక్కకి పేపరు చదవడం రాదు'' చెప్పాడు సత్యం.

- డి. క్రిష్టఫర్‌బాబు (మణుగూరు)



వంశీకృష్ణ.

కొద్దిసేపు క్రితంవరకు తన ప్రాణంలో ప్రాణం, తన ఊపిరిలో ఊపిరి - తన సర్వస్వం అతనే. మరి ఇప్పుడు? ఇప్పుడు వంశీ తనకేమీ కాడు. ఎంత విచిత్రం. ఐదు నిమిషాల క్రితంవరకు తనవాడైన వ్యక్తి ఇంతలోనే పరాయివాడవుతాడా. ఇలా కూడా జరుగుతుందా... ఈ ప్రపంచంలో.

అయినా వంశీకృష్ణ లేనిది తను బ్రతకగలదా? అసలు ఆ ఊహనైనా భరించగలదాని. వంశీ తనక్కావాలి. జీవితాంతం అతని పాదాలవద్ద ఇంత చోటు దొరికితే చాలు. అలా అతని స్పర్శతో బ్రతికేయగలదు తను.

మరీ వంశీ ఏమిటి ఉత్తరంలో అలా వ్రాశాడు. నిజంగా మనిద్దరం ఏదో విడిపోతున్నట్టే. ఇకనుంచి ఒకళ్లకొకళ్లం ఏమీ కానట్టే.

అతని పెళ్లయితే అవ్వనీ, అతని పెళ్లితో తన ప్రేమకేమిటి సంబంధం?

నువ్వు నన్ను పెళ్లిచేసుకుంటావని నీమీద నాకు ప్రేమ పుట్టలేదు వంశీ! నువ్వు మరొకర్ని పెళ్లిచేసుకోగానీ ఆ ప్రేమ మాసిపోవడానికి నేను అశాశ్వతం. నీమీద నా ప్రేమ మాత్రం శాశ్వతం. అది నీచేతిలో చెయ్యేసి తిరుగుతుంది. నీ అడుగులో అడుగేసి కదులుతుంది. నీ కళ్లలోకి చూసి నవ్వుతుంది. నీ పెదాల నవ్వును చూసి మైమరచిపోతుంది. నీ హృదయంలో శాశ్వతంగా వుండిపోతుంది. దట్సాల్.

నాకు పెళ్లైంది. నన్ను మర్చిపో అని నువ్వన్నంత మాత్రాన నిన్ను మరచిపోవడమేనా నేను. పిచ్చి. ఇన్నేళ్ల మన ప్రేమలో నువ్వు నన్నర్థం చేసుకుంది ఇంతేనా?

ఆమె అప్పటికప్పుడు అర్జంటుగా వంశీకృష్ణను కలవాలనుకుంది.

అతనెళ్లేసరికి ఆమె ఒక్కర్తె పార్కులో కూర్చుని వుంది. ఆమె మొహంలో ఇదివరకటి కాంతిలేదు. మొహం కళావిహీనంగా వుంది. పడమటి కొండల్లోకి జారిపోతున్న సూర్యబింబంలా నిస్సారంగా వుంది.

వంశీకృష్ణ నేరుగా సంధ్య దగ్గరకెళ్లి మోకాళ్ల మీద కూర్చుని ఆమెవళ్లో తలపెట్టుకున్నాడు. అప్రయత్నంగా సంధ్య వేళ్లు అతని క్రాఫ్‌ను సవరించడం మొదలుపెట్టాయి.

''నన్ను క్షమించు సంధ్యా''

''దేనికి?'' తలను మరింత అతనివైపు వంచి అంది సంధ్య.

''నిన్ను పెళ్లిచేసుకోలేకపోతున్నందుకు''

''పెళ్లికాకపోతే పోనీ! నీ హృదయంలో ఇంత చోటిచ్చావు. అది చాలు నాకు. మైడియర్ వంశీ! నిన్న మొన్నటివరకు నేనేం ఆలోచించేదాన్నో తెలుసా? ప్రేమించుకోకుండా పెళ్లిచేసుకుని జీవితాంతం ఒకరికొకరు తోడునీడగా బ్రతకగలిగినప్పుడు పెళ్లిచేసుకోకుండా కేవలం ప్రేమతో జీవితాంతం కలిసిమెలిసి వుండలేమా? ఏ పెళ్లికంటే తీసిపోయిందా ప్రేమ! అని నిరూపించాలనుకున్నాను. అందుకు నీవు అంగీకరిస్తావో లేదో అనికూడా భయపడ్డాను. థాంక్‌గాడ్! ఆ దేవుడు నాకీ అవకాశం కల్పించాడమే!''

''నువ్వేమంటున్నావో నాకర్థంకావడంలేదు'' తల ఎత్తి ప్రశ్నార్థకంగా ఆమెవైపు చూస్తూ అన్నాడు వంశీకృష్ణ. పచ్చగా విశాలంగా కనిపిస్తున్న అతని నుదుటిమీద ముద్దుపెట్టుకుని అంది సంధ్య.

''ఇందులో అర్థంకాకపోవడానికేముంది? నీకేమీ పెళ్లయింది. ప్రేమకోసం కట్టుకున్న భార్యను, కన్న తల్లిదండ్రుల్ని బాధపెట్టడం మంచిదికాదుకదా! అందుకే నువ్వు నీ భార్యతో వుంటుండు. మన ప్రేమను బ్రతికించుకోవడంకోసం నేను పెళ్లికాని నీ భార్యగా మిగిలిపోతాను. నిజం వంశీ! నువ్వు లేనిది నేను బ్రతకలేను. నెలకు ఇరవై ఐదురోజులు నీ

భార్యతోనే వుంటుండు. కనీసం ఐదురోజులు నాతో వుండు చాలు. అంతకంటే ఎక్కువ నేనేమీ కోరను''

''నువ్వు చెప్పినట్టు చేసే పనైతే ఈ సమాజం నిన్ను నా ఉంపుడుగత్తె అంటుంది. ఆ విషయం ఆలోచించావా నువ్వు?''

''అననీ. ఈ సమాజం గురించి నేను పట్టించుకోను. నాకు నువ్వు కావాలి. నీ ప్రేమకావాలి. నీతో నా జీవితం కావాలి. అంతే''

ఆమె వళ్లోనుంచి లేచి నిలబడ్డాడు వంశీకృష్ణ. దూరంగా ఎగురుతున్న జంటపక్షులకేసి దృష్టి సారించి అన్నాడు.

''అందుకు నేనంగీకరించను. నా సంధ్యకు నా మూలంగా అంత ఖర్మ పట్టనివ్వను. నువ్వు సుఖంగా వుండాలి. సంతోషంగా వుండాలి. అంతేకాని నాకు రెండో భార్యగా వుంటూ సమాజంలో నీ గౌరవాన్ని తగ్గించుకుని బ్రతకాల్సిన ఖర్మ నీకేం పట్టింది. నీ పెళ్లి దగ్గరుండి నే జరిపిస్తా! నాకంటే అందగాడ్ని, ఆస్తిపరుడ్ని నీకు భర్తగా తీసుకొస్తాను''

''నువ్వు తప్ప మరొకరికి నా హృదయంలో చోటులేదు. నిన్ను తప్ప మరొకర్ని భర్తగా స్వీకరించలేను. అయినా నువ్వు అనవసరంగా ఏవేవో ఊహించుకుంటున్నావు. ముందుముందు నావలన నీకే ప్రాబ్లం రాదు. అంతగా అయితే నువ్వు మీ ఊళ్లో వుండు. నేను సిటీలో వుంటాను. కనీసం నెలకు ఒకసారైనా వచ్చిపోతే చాలు. ప్లీజ్ వంశీ... నిన్నొదిలిపెట్టి నేనుండలేను. నా బంగారుకొండవికదూ! నా మాట వినవూ''

అతని గడ్డం పట్టుకుని ప్రాధేయపడసాగింది. ఆమె బాధను చూస్తుంటే అతనిక్కూడా దుఃఖం ఆగడంలేదు. మరికొద్దిసేపు అక్కడే వుంటే నిగ్రహించుకోవడం కష్టమవుతుందని భావించి, ఎంత తొందరగా వీలైతే అంత తొందరా అక్కడ్నుంచేకాదు, ఆమె జీవితంనుంచే శాశ్వతంగా వెళ్లిపోవాలనుకున్నట్టుగా ''ఆ ఆవేశమే వద్దనేది. చేతులారా సమస్యనుకొనితెచ్చుకుంటావెందుకూ... నీకేం తక్కువని నా రెండో భార్యగా వుంటావు. అందంలేదా... చదవులేదా... ఐశ్వర్యం లేదా... నా పెళ్లి ఎలాగో జరిగిపోయింది. నేను నిన్ను మరచిపోయినట్టు - నువ్వు నన్ను మరచిపోయి హాయిగా పెళ్లిచేసుకో. అంతకంటే నేను చెప్పేదేమీ లేదు. ఆ విషయం చెప్పడానికే ఇప్పుడు నీ దగ్గరకొచ్చింది''

## నవ్వుల హీరో



హీరోకి సమాంతరంగా ప్రాధాన్యతగల హాస్య నటులు రేలంగి. శ్రీకృష్ణ తులాభారం, పాతాళ భైరవి, సంసారం, ధర్మదేవత, పక్కింటి అమ్మాయి, మిస్సమ్మ, దొంగరాముడువంటి సినిమాలలో రేలంగిగుప్పించిన హాస్యం అసమానం. ఇతని అసలుపేరు వెంకట్రామయ్య మరుగునపడి రేలంగిగా స్థిరపడింది. కొన్ని సినిమాలలో పాటలుకూడా పాడాడు. 1970లో పద్మశ్రీ బిరుదును పొందాడు. తన స్వస్థలంలో అతి మంచవానిగా పేరుపొందిన హాస్యనటుడు రేలంగి.

- మదన్

''అదంత తేలిక అనుకోకు...'' ఆమె మాటలు పూర్తికానేలేదు. అతను విసురుగా బయటకు నడిచాడు.

అక్కడ ఒంటరిగా సంధ్య మిగిలింది. చుట్టూ చీకటి కమ్ముకుంటోంది. ఆమెకింకేం చేయాలో పాలుపోవడంలేదు. అక్కడ్నించి వెళ్లిపోవాలని మాత్రం తెలుసు. జీవితంలో మళ్లీ వంశీకృష్ణకు కనిపించనంత దూరంగా వెళ్లిపోవాలి. అంతే!

ఆమె లేచింది. ఆమెతోపాటు గాలి కదిలింది. దూరంగా సముద్రపు అలల పోటు ఎక్కువయింది. ఆమె అడుగుతీసి అడుగులేస్తుంటే భూమి దిగులుతో కృంగిపోతున్నట్టుంది.

ఇంటికి ఎలా చేరకుందో తెలియదు. వెళ్లగానే పైనున్న సూట్‌కేస్ క్రిందకి దించి లోపల తను భద్రంగా దాచుకున్న తనకిష్టమైన గులాబీకలర్ శారీ బయటకు తీసింది. లోపలి మడతలమధ్యనుంచి కొన్ని ఉత్తరాలు బయటకు తీసింది.

అవన్నీ వంశీకృష్ణ రాసిన ప్రేమలేఖలు. మొదటిలేఖ విప్పి చదవడం మొదలుపెట్టింది.

''డియర్ సంధ్య!

ఇది నేను వ్రాస్తున్న మొట్టమొదటి ప్రేమలేఖ! నీకేకాదు. నా జీవితంలోకూడా నేను వ్రాస్తున్న మొదటి ప్రేమలేఖ ఇదే! ఇంతకుముందు ప్రేమ లేఖ వ్రాయడమంటే అదేదో మేడమీద నిలబడి నీ పెదాల నవ్వును, నీ కళ్ల వెలుగును చూస్తూ గడపడమంత తేలిక అనుకునేవాడిని.

తీరా వ్రాయడానికి ప్రయత్నిస్తే అర్థమైంది: ఒక మంచి ప్రేమలేఖ వ్రాయడమంటే ఒక మంచి అమ్మాయిని (నీలాంటి) పెళ్లికాక ముందే సొంతం చేసుకోవడమంత కష్టమని. ఏమిటి? పోలిక నచ్చలేదా అలా దిగులుగా మొహం పెట్టావు. ముందే చెప్పనుకదా! ఇది నేను వ్రాస్తున్న మొదటి ప్రేమలేఖ అని. ఎడ్జస్ట్ అయిపోవాలి తప్పదు మరి.

ఇకనుంచి నేను వారానికో ప్రేమలేఖ చొప్పున వ్రాస్తుంటాను. నువ్వు మాత్రం రేపు మన పెళ్లి అయిన తర్వాత అవన్నీ తిరిగి నాకే మన మొదటి రాత్రి చదివి వినిపించాలి. తెలిసిందా? ఇలా ఎందుకు చెప్పుతున్నానో తెలుసా? నేనింత కష్టపడి వ్రాసిన ప్రేమలేఖల్ని నువ్వు ఒకే ఒక్కసారి చదివి చెత్తబుట్టలో పడెయ్యకుండా నీ గుండెల్లో భద్రంగా దాచుకోవడం కోసం..ఎంత స్వార్థమో చూడు!

అసలు నిన్ను ఎప్పట్నుంచి ప్రేమించడం మొదలుపెట్టానో తెలుసా సంధ్యా! రెండు నెలల క్రితం నేను మేడమీద బంతిని ఎగరేస్తుండగా అది చెయ్యిజారి కింద బట్టలారేస్తున్న నీ మీద పడింది. అప్పుడు నువ్వు భద్రకాళిలా కోపంగా తలఎత్తినావైపు చూశావు. నిజం చెప్పొద్దూ. మీ ఇంట్లో చెప్పి రూమ్ ఖాళీ చేయిస్తావేమో... మళ్లీ రూమ్ ఎక్కడ వెతుక్కోనేదిరా దేవుడా అని భయపడి చచ్చాననుకో. కాని నువ్వు మాత్రం అందుకు భిన్నంగా చిన్నగా నవ్వి అక్కడ్నుంచి వెళ్లిపోయావు. అదిగో ఆ నవ్వే నవ్వంటే పీకలలోతు ప్రేమలో కూరుకుపోయేట్టు చేసింది.

అప్పట్నుంచి ఎవరో రచయిత చెప్పినట్టు

నా రూపం కోసమై నేను అద్దంలో చూసుకున్న ప్రతిసారీ చిత్రంగా నీ రూపం కనిపిస్తుంది. ఇదెల్లా సాధ్యం అని మేఘాలతో దోబూచులాడుతున్న నక్షత్రాలను ప్రశ్నిస్తే... నీకంటే నీకు ఆ అమ్మాయే ఎక్కువ అని జవాబిచ్చాయి.

నిజమా!

అందమైన సాయంత్రంవేళ చెట్లమధ్య నడుస్తూ నడుస్తూ ఆకాశంకేసి చూస్తే కదిలే మేఘాలమధ్య నీ రూపం. ఆ కవ్విస్తూ కనిపించే నీ రూపాన్ని చూస్తూ నాలుగడుగులు వేశానో లేదో... అదిగో ఆ తన్మయత్వపు ఆఖరి క్షణాన గులాబి కొమ్మ రెమ్మ ఒకటి కనుకొనను సుతారంగా తాకింది. అబ్బా! ఇంకా ఎన్నాళ్లీ విరహపు ఎదురుచూపులు? నాకైతే

ఇప్పటికిప్పుడు నీముందు వాలాలని, నీ చల్లని వడిలో తల పెట్టుకుని అమృతం కురిసే నీ కళ్లలోకి చూస్తూ గడపాలని ఎన్నెన్నో కోరికలు. నిజంగా మనిషి కోరుకున్నవన్నీ జరిగేపనైతే ఎంత బాగుంటుందోకదా!

అప్పుడు నేను నీ వడిలో కాకుండా ఏ శ్రీదేవి వడిలోనో... మాధురీ దీక్షిత్ వడిలోనో తలపెట్టుకుని పడుకోవాలని వుందని కోరుకుంటానేమో...

బాప్‌రే! నేనేం వ్రాయాలనుకుని ఏం వ్రాసేస్తున్నాను... ప్లీజ్ సంధ్యా... అలా సీరియస్‌గా, కోపంగా చూడకు... జస్ట్ నిన్ను ఉడికించడంకోసమే అలా వ్రాశాను.

నవ్వులేని మొహం - అలకలేని ప్రేమ వేస్ట్ కదూ! అలిగినప్పుడు ముడుచుకునే నీ చిన్ని పెదాల్ని చూస్తూ గడపడమంటే నాకెంతో ఇష్టం.

నీ

వంశీ

కళ్లలోకొచ్చి నిలిచిన కన్నీళ్లను తుడుచుకునే ప్రయత్నమేమీ చేయకుండానే రెండో ఉత్తరం తీసింది సంధ్య.

'ప్రియతమా!

సంవత్సరంనుంచి అడుగుతున్న ముద్దును నిన్న సాయంత్రం అడక్కుండానే ఇచ్చినందుకు థాంక్స్! అలాగే రోజుకో ముద్దు ఇచ్చి నన్ను ధన్యుడ్ని చేస్తావని ఆశిస్తూ...


నీ

వంశీ

ఆమె మరో ఉత్తరం తీసింది.

''డియర్ సంధ్య!

ఏదో వ్రాయాలనే ఆరాటం. ఏమీ వ్రాయలేని నిస్సహాయత అలా కలం పట్టుకుని నీ ఆలోచనలతో గడపడం కూడా మధురంగానే వుంటుంది. నేను వ్రాసేటప్పుడు నువ్వు చూడలేదుకదూ! వ్రాస్తూ వ్రాస్తూ మధ్యలో శూన్యంలోకి చూడడం - ఒక్కోసారైతే లేచి అటు ఇటు తిరగడం. ఒక మంచి వాక్యం వ్రాయగానే నాలో నేను నవ్వుకోవడం. ఆ నవ్వును ఎవరైనా చూశారేమో అని భయంభయంగా అటు ఇటు చూడడం - ఒకటనేమిటి? మువ్వ పరిచయమైన తర్వాత నా ప్రతి కదలిక ఒక చిత్రమే



అనుకో! నిజం.

ఈ మధ్య నా ప్రతి ఆలోచన నీ గురించే! సముద్రంలోనుంచి ఉధృతంగా పైకి లేచిన అల - మరలా సముద్రంలోకెళ్లి కలిసినట్టు - నా ప్రతి ఆలోచన నీ దగ్గర్నుంచే మొదలై మరలా నీ ఆలోచనలదగ్గరే అంతమవుతున్నాయి.

ఒక మధురమైన రాత్రి గడిచిన తర్వాత నీ జ్ఞాపకాలతో నిద్రలేచిన నేను అద్దంలోకి తొంగిచూస్తే నీసంతా పరుచుకున్న కురులతో, చెదిరిన బొట్టుతో, సిగ్గు దొంతరుల మధ్య ఊగిసలాడే మోముతో నువ్వు కనిపిస్తున్నావంటే... ఇక నేనంటూ లేనేమో విశ్వమంతా నువ్వేనేమో అన్న భ్రాంతి కలుగుతుంది.

మొన్నరాత్రి నీ కలల దుప్పటి కప్పుకుని ఆకాశంమీది ఒంటరి నక్షత్రాన్ని చూడడంకోసం ప్రయత్నిస్తుంటే పదే పదే అడ్డువచ్చిన నీ మోము ఎంత ఇబ్బంది పెట్టిందంటే ఇక ఆగలేక రాత్రికి రాత్రి నీ దగ్గరకు వద్దామనుకుని కప్పుకున్న దుప్పటి తియ్యబోయి చెదిరిపోయే నీ జ్ఞాపకాలు గుర్తుకొచ్చి ఆ ప్రయత్నం విరమించుకున్నాను.

ఇటు నీ దగ్గరకు రానూలేక, అటు ఒంటరిగా వుండనూ లేక ఎన్నాళ్లిలా ఒంటరిగా బ్రతకగలను?

చల్లగాలికి వర్షించే మేఘాలు - చేతివ్రేళ్లకు స్వరాలు పలికే వీణ - హృదయాన్ని గిలిగింతలుపెట్టే ప్రియురాలి చిరునవ్వు ఇవి ఎప్పుడూ అద్భుతాలే కదూ! నీ చిరునవ్వు గుర్తుకొస్తే చాలు ఒక ముఖేష్ పాట విన్నట్టు - ఒక రవీంద్రుని సాహిత్యం చదివినట్టు తాధాత్మికతతో మునిగిపోతాను.

అంత అద్భుతంగా నవ్వగలగడం ఆ దేవుడు నీకిచ్చిన వరమేమో... ఆ నవ్వును చూస్తూ గడపడం నాకిచ్చిన అదృష్టమేమో... నేనింతగా ఆఖరి క్షణంలో కూడా నీ పెదాల చిరునవ్వును చూస్తూ ప్రాణాలు విడవాలన్నంత ఇదిగా... ఏమిటో నా ప్రాణాలు పోయే సమయంలో నువ్వెందుకు చిరునవ్వుతో వుంటావు. అన్నీ పిచ్చి పిచ్చి ఆలోచనలు.

అసలు ప్రేమే ఒక పిచ్చి కదూ!

నేను నేనుగా కాక - నేనే నువ్వుగా, నీలో కలిసిపోయే రోజెప్పుడొస్తుందో... ఆరోజుకోసం ఎదురుచూస్తూ...

నీ
వంశీ

మరో ప్రేమలేఖ తీసింది.

''నాకోసమై అవనిమీద ఆవిర్భవించిన అద్వితీయ అసామాన్య సౌందర్యవతి సంధ్యా!

మొన్నొకరోజు నీ దగ్గర్నుంచి వచ్చిన అరగంటకు నా స్నేహితుడొకడు వచ్చి దిగులుగా వున్న నన్ను చూసి ఎందుకలా వున్నావు అని ప్రశ్నించాడు. అప్పుడు నేనేమో నీ గురించి చెప్పి నా సంధ్య ఇంత అందంగా వుంటుందికదా. మరి నేనెందుకు అంత అందంగా లేను అన్నాను. దానికతను పెద్దగా నవ్వి అందం మగాళ్లకెందుకోయ్ అన్నాడు.

ఒక ప్రక్కేమో ఆడా మగా సమానమని అంటూంటారు. మరో ప్రక్కేమో అందం అనేది ఆడవాళ్లకే మగాళ్లకెందుకూ అంటుంటారు. ఏం మనుషులో ఏమో ఒక పట్టాన అర్థం కాదనుకో!

మొన్నొకరోజు నీకు ఉత్తరం వ్రాయడానికి కాగితం, కలం అందుకున్నాను. అర్ధరాత్రివరకు ఏం వ్రాశానో అర్థమే కాలేదు. రెండు గంటలకనుకుంటాను. ఒకే ఒక ఆలోచన. అంతే! కేవలం ఇరవై నిమిషాల్లో ఉత్తరం వ్రాయడం పూర్తిచేశాను. పూర్తికాగానే - ఒక చిత్రకారుడు ఒక అద్భుతమైన చిత్రాన్ని గీయడం పూర్తిచేసి ఏ విధంగా అయితే ఉద్వేగాన్ని భరించలేకపోతాడో... అదేవిధంగా నేనుకూడా ఉద్వేగాన్ని భరించలేక అటు ఇటు తిరిగాను.

బెడ్‌మీది నీలిరంగు కాశ్మీర్ దుప్పటి నువ్వుగా

మారి నా శరీరాన్ని చుట్టుకున్నట్టు టేప్ రికార్డ్‌నుంచి వస్తున్న మహమ్మద్ రఫీ పాట నీ కంఠమై నా చెవుల్ని సోకినట్టు ఆలోచనలనుంచి తేరుకుని వ్రాసిన లేఖవైపు మరోసారి చూస్తే... తెల్లటికాగితంమీది నల్లటి అక్షరాలమధ్య నువ్వు నవ్వుతూ కనిపించావు. ఆకాశంమీది నక్షత్రాలమధ్య చందమామ నవ్వినట్టు! ఎంత అందంగా వున్నావో... ఎంత ముద్దొచ్చావో మాటల్లో చెప్పలేను. నువ్వు దగ్గరుంటే చేతుల్లో తప్పు! బ్యాడ్ లక్!

ఆ సమయంలో నువ్వేమో నీ జ్ఞాపకాలతో నేనొకడ్ని మేలుకుని వున్నానన్న ధ్యాసకూడా లేకుండా ఆదమరచి నిద్రపోతూ వుంటావు.

ఆ ఆలోచన రాగానే ఎంత బాధేసిందో తెలుసా? ఉక్రోషంతో వ్రాసిన లేఖను చింపెయ్యబోయి ఎలాగోలా తమాయించుకున్నాను.

గానం రాగాన్ని బట్టి మారుతుంది.

చిత్రం గీతల్ని బట్టి మారుతుంది.

ప్రకృతి కాలాన్ని బట్టి మారుతుంది.

నా జీవితం నీ సహచర్యంతో వికసిస్తుంది.

వచ్చేయి ప్రియతమా! నీ రాకకోసం నాకున్నవి రెండే కళ్లు! అవి రెండూ నాల్గై, నాలుగు ఎనిమిదై, ఎనిమిది పదహారై, చివరకు ఒళ్లంతా కళ్లై ఎదురుచూస్తుంటాయి.

ఈ ఉత్తరాల పర్వం ముగిసి ఒకరి సమక్షంలో ఒకరు గడిపే క్షణాలెప్పుడొస్తాయోకదా! ఆ క్షణాలకోసం ఎదురుచూస్తూ...

నీ
వంశీ

చివరి ఉత్తరం తీసింది.

'హలో సంధ్యా!

బాగున్నావా? నీకే హాయిగా వుండి వుంటావు. నేనే ఇలా... నీతో ఎక్కువ చనువు తీసుకుంటే మన ప్రేమ వ్యవహారం మీ ఇంట్లో తెలిసి ఎక్కడ నా చేత రూమ్ ఖాళీ చేయిస్తారో అని క్షణం ఒక యుగంలా గడుపుతున్నాననుకో!

మీ ఇంట్లోవాళ్లేకాదు. ఈ ప్రపంచం మొత్తం ఏకమైనా నిన్ను నానుంచి దూరం చేయలేరు. నేనెంతగా నీ ప్రేమలో తలమునకలై వున్నానంటే... మనం కదిలితే కదిలినట్టు మనం ఆగితే ఆగినట్టు కనిపించే నక్షత్రాలకింద, చుట్టు మైదానాన్ని కలిగివున్న ఓ పెద్ద కొండమీద నిలబడి గొంతు మూగపోయేలా

## తోట

"నా మనసనే పూలతోటను నీ చేతుల్లో పెడ్తే ఏం చేస్తావ్ తరీష్?" అడిగింది పూలపిచ్చిదైన ప్రేయసి.

పాదులుతీసి నీళ్లు పోస్తాను!" పళ్లునూర్తూ అన్నాడు.

-అండె అనిత (చిత్తూరు)



పెద్దగా అరవాలనిపిస్తుంది.

'సంధ్యా! ఐ లవ్ యూ! ఐ లైక్ యూ' అని.

నీ
వంశీ

ఉత్తరం చదవడం పూర్తయింది. ఆమెకిక దుఃఖం ఆగలేదు. అప్పటికే ధారగా కారుతున్న కన్నీళ్లు ఆమె వక్షస్థలాన్ని తడిపేశాయి. ఇంత ప్రేమను కురిపించిన వంశీయేనా ఇప్పుడిలా మాట్లాడింది. ఆ ప్రేమంతా ఇప్పుడేమైంది? అసలీ ప్రపంచంలో ప్రేమనేది వుందా? లేదు. ప్రేమ లేదు. ప్రేమనేది వట్టి నాటకం. కొద్దిరోజుల కాలక్షేపం కోసం యువతీయువకులు కనిపెట్టిన గేమ్ - లవ్?

వంశీమీది ద్వేషమంతా ఆ ప్రేమలేఖలమీద చూపిస్తూ ఆ ప్రేమలేఖలన్నీ చించి ముక్కలు ముక్కలు చేసింది. ఆ తర్వాత దుఃఖాన్ని ఆపుకోలేనట్టుగా దిండులో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టింది.

ఆమె బాధ కన్నీళ్లతో పోయేదికాదు. కాలం తెచ్చే మార్పులతో పోవలసిందే!

◆ ❖ ◆

గతంనుంచి తేరుకున్నారిద్దరూ.

"నువ్వే నువ్వే కావాలని నన్ను దూరంచేశావు. నన్ను కాదని నువ్వెళ్లిపోయిన తర్వాత చాలా రోజులవరకు మనిషిని కాలేకపోయాను. ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నదానిలా దిగులుగా వున్న నన్ను చూసి అమ్మ మంచం పట్టింది. చివరకు డాక్టర్ మాటను కాదనలేక అమ్మకోసం పెళ్లి చేసుకున్నాను. కాని, విధి మరోసారి నా జీవితంతో ఆడుకుంది. ఇద్దరు పిల్లలు పుట్టాక ఆయన గుండెపోటుతో మరణించారు."

అప్పుడు గమనించాడు వంశీకృష్ణ ఆమె నుదుటిమీద బొట్టు లేకపోవడం. మెడలో మంగళసూత్రం కనిపించకపోవడం. ఆమెను చూసిన ఆనందంలో ముందుగా అవన్నీ తాను గమనించలేదు. గమనించగానే నదిలో ప్రశాంతంగా ఈదుకుంటున్న ఈతగాడు ఒక్కసారి సుడిగుండంలో చిక్కుకున్నట్టు విలవిల్లాడిపోయాడు.

ఈలోపు సంధ్య అంది.

"నీగురించి చెప్పనే లేదు"

అతను చప్పున ఆలోచనల్లోంచి తేరుకున్నాని అన్నాడు

"చెప్పడానికేముంది? నీతో అంత కఠినంగా మాట్లాడి నన్ను మరచిపో అన్నానేకానీ, ఆ తర్వాత నిన్ను మరచిపోవడం కోసం నేను చేసిన ప్రయత్నాలన్నీ వ్యర్థమయ్యాయి. ఎక్కడికెళ్లినా, ఏ పనిచేయాలని చూసినా నీ ఆలోచనలే వెంటాడుతుండేవి.

నా బాధల్ని చూడలేక నా భార్య సగం దిగులుతో మంచంపట్టింది. కొన్నాళ్ల తర్వాత ఆ దిగులుతోనే మరణించింది. ఇంట్లోవాళ్లు మళ్లీ పెళ్లిచేయాలని చూశారు. నేనే అంగీకరించలేదు. జీవితంలో మళ్లీ పెళ్లి పేరే ఎత్తకూడదనుకున్నాను. ఇటు ప్రేమించిన నువ్వు దూరమయ్యావు. అటు పెళ్లిచేసుకున్న భార్య దూరమైంది. నా జీవితానికే అర్థం లేకుండా పోయింది. తొందరపడి ఈ పెద్దవాళ్లు చేసిన ఒకే ఒక తప్పు మన ముగ్గురి జీవితాల్ని నాశనం చేసాయి."

అతను చెప్పడం ముగించాడు. ఇద్దరి మధ్య కాసేపు నిశ్శబ్దం రాజ్యం చేసింది.

సరిగ్గా అప్పుడే హౌరా ఎక్స్‌ప్రెస్ ఒకటో నెంబర్ ప్లాట్‌ఫామ్ మీదకొస్తున్నట్టు మైకులో ఎనౌన్స్‌మెంట్ వినిపించింది.

సంధ్య ఎక్కాల్సిన ట్రైను అదేకావడంతో వంశీకృష్ణ ఆలోచనలు వేగంగా పరుగులు తీయడం మొదలుపెట్టాయి.

సంధ్య ఇప్పుడెళ్లిపోతే మళ్లీ జీవితంలో

కనిపించదు. ఇప్పుడే తన మనసులోని మాట చెప్పేయాలి. ఆమెకు భర్తలేడు. తనకు భార్యలేదు. అటువంటప్పుడు ప్రేమించుకున్న తామిద్దరు ఒకటైతే వచ్చే నష్టమేమిటి. సంధ్యపిల్లలు తన పిల్లలు కారా? అవును. సంధ్యతో ఇప్పుడే ఈ విషయం గురించి మాట్లాడాలి.

ఆలోచనలనుంచి తేరుకుని అతనేదో చెప్పబోతుండగా ముందుగా ఆమె కల్పించుకుని అంది.

''అన్నట్టు చెప్పడం మరచిపోయాను. వచ్చేనెల ఇరవై రెండో తేదీ నా పెద్దకూతురు వంశీప్రియ పెళ్లి. నువ్వు తప్పకుండా రావాలి''

ఆ మాటలతో అప్పటివరకు ఆలోచించిన అతని ఆలోచనలన్నీ చెల్లాచెదురయ్యాయి. కూతురి పెళ్లిచేసి అత్తవారింటికి పంపించాల్సిన ఈ వయసులో మనం పెళ్లిచేసుకుందాం అని ఎలా అనగలడు తను?

ఒకవేళ తను అడిగినా అందుకు సంధ్య అంగీకరిస్తుందా? ఎప్పటికీ అంగీకరించదు. పైగా కూతురి పెళ్లి చేయాల్సిన ఈ వయసులో తల్లి పెళ్లికి తయారైంది అని ఈ సమాజం నవ్వుతుంది అంటూ బాధపడుతుంది.

ఊహు అడిగి ఆమె మనసు బాధపెట్టి తను బాధపడడం తప్ప లాభంలేదు. ఇక తమ ఇద్దరి జీవితాలింతే!

అతను ఏదో ఆలోచనల్లో వుండడం చూసి ఆమె అంది.

''ఏమిటాలోచిస్తున్నావు?''

''ఏం లేదు. నీకు పెళ్లీడుకొచ్చిన కూతురుందని గ్రహించక ఏవేవో ఊహించుకున్నాను. అవన్నీ తలచుకుంటుంటే నాకే నవ్వొస్తుంది''

ఆమె అర్థం చేసుకున్నట్టుగా అతని చేతిని తన చేతులమధ్యకు తీసుకుని ఆప్యాయంగా స్పృశించింది.

''వంశీ! నువ్వు నాతోపాటు వచ్చేయకూడదూ!''

''ఎవరీయన అని పిల్లలడిగితే ఏమని సమాధానం చెపుతావు?''

''మీ అంకుల్ అని చెపుతాను''

''ఇన్నాళ్లు లేని అంకుల్ ఇప్పుడెక్కడ్నుంచి వచ్చాడని ప్రశ్నిస్తే''

సమాధానం దొరక్క ఆమె తలవంచుకుంది. ఈలోపు అతనే మళ్లీ అన్నాడు.

''వద్దు సంధ్యా! ఈ వయసులో మళ్లీ నీ జీవితంలోకి ప్రవేశించి నీకు, నీ పిల్లలకు మధ్య మనస్పర్థలు తీసుకురావడం నాకిష్టంలేదు. అంతకంటే ఇలాగే నీ జ్ఞాపకాలతో ఒంటరిగా బ్రతకడం మంచిది''

హౌరా ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫామ్‌మీదకొచ్చి ఆగింది. ఆమె లేచింది. ఆమెతోపాటు అతను రైలువరకు వచ్చాడు.

''ఇకనుంచి నీకే కష్టం వచ్చినా నీ మనిషిని నేనొకడాన్ని వున్నానని మాత్రం మరచిపోకు'' ఆమె రైలెక్కింది. గార్డు పచ్చ జెండా ఊపాడు: ఆమె వంగి అతని నుదుటిమీద ఆప్యాయంగా ముద్దుపెట్టింది. ఆమె చేతిని వదల్లేక వదల్లేక వదిలాడతను. రైలు కదిలింది. ఆ రైలుతోపాటు అతని మనసు కదిలింది. ఆమె మాత్రం తన మనసును అతనివద్దే వదిలి వెళ్తున్నట్లుగా అతనివైపే చూస్తూండిపోయింది. చేతులు మాత్రం వీడ్కోలు చెప్పుకుంటున్నాయి. క్రమంగా ఇద్దరి మధ్య దూరం పెరిగింది.

